క్లుప్తంగా

బీమా తక్షణ సాయం అందజేత

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన దాసరి సురేష్ (36) అనే వ్యక్తి అనారోగ్యంతో కోలుకోలేక రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో తక్షణ సాయం కింద సర్పంచ్ వడ్డె ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి మృతుడు భార్య గీతకు రూ.10వేల నగదు శనివారం అందజేశారు. మరో రూ.90వేలను ప్రభుత్వం నామినీ బ్యాంక్ ఖాతాలో జమచేస్తుందని చెప్పారు.

రణమండల కొండలో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం తుది శనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు టీజీ పాండు రంగశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, ప్రత్యేక పూల అలంకరణ అలంకారం, తులసీహారం, నైవేద్యం, మహామంగళహారతితో పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు ఉపన్యాస భారతి పోటీలు

ఆదోనిఅర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ రాయచోటి రామయ్య, రాయచోటి సుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక లక్ష్మమ్మవ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో ఉపన్యాస భారతి పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు సనాతన ధర్మం ఆవశ్యకత, ఇంటర్ నుంచి ఆపై తరగతుల విద్యార్థులకు ఆదర్శ మానవ సంబంధాలు ఎలా ఉండాలి, భారతీయ ఇతిహాసాలు, చూపే పరిష్కారంపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో 20 మందికి పైగా పాల్గొన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు అవ్వ బ్యాంకు సీఈఓ మురళీకుమార్ తెలిపారు.

మంత్రాలయం సీఐగా ఎరిషావలి



సీఐ ఎరిషావలికి ఆహ్వానం పలుకుతున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం : బదిలీల్లో భాగంగా కోసిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎరిషావలి ఇటీవల మంత్రాలయంకు బదిలీ అయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. తదనంతరం పోలీస్‌స్టేషన్ చేరుకోగా సబ్ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రాజు, కిరణ్ బాబు, ప్రహ్లాద ఆయనకు స్వాగతం పలికారు.

22న ఉరుకుందలో వేలం పాటలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈనెల న కలగలపు బియ్యం, బేడలు, రవ్వ, బెల్లం పోగు చేసుకొనే హక్కు కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ టెండరు, షీల్డ్ టెండరుతో పాటు బహిరంగ వేలం కూడా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

అరుణ్‌జ్యోతి నగర్‌లో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోనిసెంట్రల్: రాంజల రోడ్డు క్రిస్టియన్ రిఫార్మ్డ్ చర్చి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అరుణ్ జ్యోతినగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రంజిత్‌కుమార్, చైతన్య కాల్విన్, సలోమీదేవకుమారి పాల్గొని స్థానికులకు ఉచితంగా బ్లడ్ ప్రెజర్, షుగర్, అనిమియా, జాయింట్ పెయిన్స్, కంటి సమస్య, పళ్ల సమస్యలు, ఉదర సంబంధిత జబ్బులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. మణిపూర్ సంఘం కాపరి శాంగ్లయి సందర్శించి అభినందించారు.

అయోధ్య అక్షితల పంపిణీ

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామంలో అయోధ్య అక్షితలను ఇంటింటికీ శనివారం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు లక్ష్మయ్య ఆధ్వర్యంలో పంపిణీ కొనసాగింది.అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అక్షితలు పంపిణి చేశారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇంటి పట్టా రాలేదని ఎవరూ అధైర్యపడొద్దని, అర్హులై ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే స్థలం కేటాయిస్తామని చెప్పారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నివాసముంటున్న పేదలకు ఎమ్మెల్యే తన స్వగృహంలో ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. గతంలో రూ.2,100 డీడీ చెల్లించిన ప్రతి ఒక్కరికీ స్థలం కేటాయిస్తున్నామన్నారు. ఇందులో ఎవరెన్ని చెప్పినా నమ్మవద్దని సూచించారు. టీడీపీ లాగా తమది పేదలను మోసం చేసే పార్టీ కాదని, చెప్పింది చేసి చూపుతున్నామన్నారు. తమ నాయకుడు చూపిన బాటలో నడుస్తున్నామని, ఆయన కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చి దేశానికే ఆదర్శంగా మారారని కొనియాడారు. 10, 15, 21, 19 వార్డుల్లో రూ.2100 డీడీలు కట్టిన 50 మంది పేదలకు పట్టాలను అందజేశారు. ఇంటి పట్టాలతో పాటు పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కొన్ని వార్డుల్లో కొంతమంది పట్టాలు పంపిణీ సమయంలో గైర్హాజరై ఉంటారని, వారిని కూడా వలంటీర్ల ద్వారా గుర్తించి పంపిణీ చేస్తామని తెలిపారు. టిడ్కో ఇళ్లు వస్తాయని కొందరు దరఖాస్తులు చేసుకున్నారని, అయితే అక్కడ మంజూరై ఉంటే ఇక్కడ పట్టాలు రావని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. పట్టాలు రాక మదనపడుతున్న పేదలకు తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. టిడ్కో ఇళ్ల గృహ సముదాయంలో నీరు లేదని, మౌలిక సదుపాయాలు లేవని టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. సంక్రాంతి పండగ తర్వాత 10 వార్డుల లబ్ధిదారులతో సమావేశమై నిర్వహించి మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యంపై అపోహలు తొలగించి ఇళ్లల్లోకి చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 14 ఏళ్ల టీడీపీ హయాంలో ఆదోనిలో ఒక్క సెంటు స్థలం కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ హయాంలో 8 ఎకరాలు కొనుగోలు చేశామని, జగనన్న హయాంలో 110 ఎకరాలు కొనుగోలు చేశామన్నారు. మొత్తం 118 ఎకరాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వీఆర్వో జయరామిరెడ్డి, కౌన్సిలర్లు రామలింగేశ్వరయాదవ్, ఇబ్రహీం, తాయమ్మ, ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయి

ఆదోనిరూరల్: పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 6వ వార్డు కాలేజ్ రోడ్డులోని కార్పొరేషన్ బ్యాంకు ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణాలను రూ.20 లక్షలతో చేపట్టారు. ముందుగా ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేశాన్నారు. గతంలో ఇక్కడ రోడ్లు లేకపోవడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే సచివాలయం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ సునీత, నాయకులు రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

వైభవంగా సుయమీంద్రతీర్థుల ఆరాధన



సుయమీంద్రతీర్థుల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : మధ్వమత, శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుయమీంద్రతీర్థుల ఆరాధన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీమఠంలో వేడుకను పురస్కరించుకుని రాఘవేంద్రుల, సుయమీంద్రతీర్థుల బృందావనాలకు ప్రత్యేక పూజల చేపట్టారు. నిర్మల్య విసర్జన, పుష్ప, పంచామృతాభిషేకాలు గావించారు. శాస్త్రోక్తంగా విశేష పూజలు చేపట్టి హారతులు పట్టారు. ఈ సందర్భంగా సుయమీంద్రతీర్థులు శ్రీమఠం అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేశారు. ఆరాధన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలో శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్, అసిస్టెంట్ పీఆర్వో బిందుస్వామి, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

ఆంత్రాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



బిల్లేకల్ వద్ద మేకకు టీకా వేస్తున్న పశువైద్యులు

ఆదోని సెంట్రల్: ఆంత్రాక్స్ వ్యాధి పట్ల గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పివి.రమణ శనివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అయా ప్రాంతాల్లో ఏటా ఈ వ్యాధి కనిపిస్తుందన్నారు. దీనిని నెత్తురు కట్టు, నెరుడు వాపు వ్యాధి లేదా రక్తపు వాపు వ్యాధి అని కూడా అంటారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేశామని, అంత్రాక్స్ వ్యాధి వచ్చిన పశువులు, గొర్రెలు, మేకలు జ్వరంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పతాయని చెప్పారు. నాలుక, గొంతు, మెడ వాపు కనిపిస్తుందని, వ్యాధి సోకిన జంతువు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతుందని, ముక్కు, నోరు రంధ్రాల నుంచి రక్తం వస్తుందన్నారు. ముందుగానే వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే మంచిదన్నారు. వ్యాధి సోకిన తరువాత చికిత్స చేయించడం కంటే అసలు వ్యాధి రాకుండా టీకాలు వేయించడం మంచిదని సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ముత్తన్న (ఫైల్)

కోసిగి: మండలంలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన కురువ ముత్తన్న (32) తన గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు. ముత్తన్నకు పదేళ్ల క్రితం ఆర్లబండ గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. పెళ్లి చేసుకున్న నాటి నుంచి భార్య సరిగా కాపురానికి వచ్చేది కాదని, పలుమార్లు పెద్ద సమక్షంలో పంచాయితీ చేసి ఒప్పించినా కొన్నాళ్లు ఉండి మళ్లీ పుట్టినింటికి వెళ్లిపోయేదన్నారు. దీంతో ముత్తన్న తాగుడుకు బానిసై భార్య, భర్త తరుచూ గొడవ పడేవారన్నారు. రెండు నెలల క్రితం భర్త వేధిస్తున్నాడంటూ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రెండు నెలలుగా గ్రామం నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ముత్తన్న పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రికి గ్రామానికి చేరుకుని భార్య రాకపోవడం, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురై తన గుడిసెలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం మృతుడి మేనళ్లుడు వెళ్లి చూడగా ఉరికి వేళాడుతూ కనిపించాడు. ముత్తన్న మృతికి భార్య, ఆమె కుటుంబ సభ్యులే కారణమని మృతుడి అక్కలు శివలింగమ్మ, ఈరమ్మ, జలాలమ్మ ఆరోపించారు. కోసిగి పోలీసులు గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

శ్రీమఠంలో మున్సిపల్ కార్పొరేషన్ జేడీ



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న సుబ్బారావు

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి సుబ్బారావు కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయం విచ్చేశారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు నేతృత్వంలో వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. రాత్రి రాఘవేంద్రుల ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం



విద్యార్థులతో వ్యాయమ ఉపాధ్యాయుడు

కౌతాళం: జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడం అభినందనీయమని బదినేహాల్ జెడ్పీ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు షేక్షావలి, మారెప్ప ఈనెల 5నుంచి 7వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగిన డెడ్జీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిస్తూ ఢిల్లీ, బిహార్, హర్యానా, పశ్చిమ బెంగాల్, చండీగఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలపై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకోవడం సంతోషకరమన్నారు. హెచ్ఎం హరినాథరావు, గ్రామ పెద్దలతో కలిసి వారిని అభినందించారు.

ఏఐటీయూసీలో చేరిక



చేరిన వారితో ఏఐటీయూసీ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని రైల్వేస్టేషన్ పక్కనున్న రెవెన్యూభవన్‌లో వేదవ్యాస్ ముని అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఇందులో ఆదోని డివిజన్ నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ 56 మంది కాంట్రాక్ట్ కార్మికులు జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో సీఐటీయూ యూనియన్ నుంచి ఏఐటీయూసీలోకి చేరారు. అనంతరం ఆదోని డివిజన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ గౌరవాధ్యక్షుడిగా వెంకన్న, డివిజన్ అధ్యక్షుడిగా మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటేశ్వర్లు, కోశాధికారి వేద వ్యాసముని, ఉపాధ్యక్షులుగా ఫిరోజ్, దత్తు, జాయింట్ సెక్రటరీలు రామాంజనేయులు, వన్నూర్, లక్ష్మన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చరణ్, శేఖన్న, రామన్నగౌడ్, పి.మల్లికార్జునస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శి వెంకన్న, సీపీఐ టౌన్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండలాధ్యక్షులు రాజు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నుంచి డివిజన్ ఉపాధ్యక్షులు వి.బసవన్నగౌడ్ పాల్గొన్నారు.

మంత్రి మద్దతుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి



మాట్లాడుతున్న విరూపాక్షి

ఆలూరు: మంత్రి గుమ్మనూరు జయరాం మద్దతుతో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బూసినేని విరూపాక్షి తెలిపారు. ఇటీవల పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం చిప్పగిరిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీకోసం చేసిన సేవలను గుర్తించి మంత్రి గుమ్మనూరు జయరాం జెడ్పీటీసీ సభ్యుడిగా అవకాశమిచ్చారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. త్వరలోనే అన్ని మండలాల్లో పర్యటించి మండల నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరతానన్నారు. గ్రామాల్లో సైతం పర్యటించేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నానన్నారు. ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరతానన్నారు. అనంతరం కర్నూలు, కడప జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌నాయుడు, గోపాల్, లక్ష్మికాంతం, మాధవకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు విరూపాక్షిని మర్యాద పూర్వకంగా కలిశారు.

పేకాట రాయుళ్లు అరెస్టు



పేకాట రాయుళ్లను అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

ఆస్పరి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగరడోనగ్రామంలో శనివారంపేకాట ఆడుతున్న వసంతకుమార్, బసవరాజు, ఈరన్న, బాబు, నల్లన్న లను అరెస్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,690 స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం నుంచి మంగళవారం వర కు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామక్రిష్ణ శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండు రూ.10,116, మూడవ బహుమతిగా రూ.5,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. పాల్గొనే వారు ఎంట్రీఫీజు ఆదివారమే చెల్లించవచ్చన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ఆదోనిరూరల్: మండలంలోని పాండవగల్లు గ్రామంలో జగనన్న సురక్ష ఫేస్-1 లో భాగాగా 20 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పి.గిడ్డయ్య, చిన్నహనుమంతు శనివారం తెలిపారు. నాయకులు రామాంజనేయులు, హనుమంతరెడ్డి, ఏఎన్ఎం విజయ, ఆశా వర్కర్ వెంకటలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తల మృతి

కోసిగి: స్థానిక సిద్ధప్ప పాళెంలో నివాసం ఉంటున్న ఎంపీటీసీ గానుగ వీరస్వామి తండ్రి గానుగ తిప్పయ్య (80) అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే జుమ్మాలదిన్నె గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ జయరాం (48) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలపై పూలమాల ఉంచి నివాళులర్పించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండగా ఉంటారని చెప్పారు. నాయకులు జగదీష్ స్వామి, కొరివి నాగరాజు, బుగజంగాల అయ్యప్ప, అంఇ, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కప్పట్రాళ్లలో డెంగీ కేసు నమోదు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో నాలుగేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శనివారం గ్రామాన్ని సందర్శించి ఇంటింటికి తిరిగి పరిసరాలను శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: అప్పటి వరకు ఉల్లాసంగా ఆడుకుంటున్న కుమారుడు ప్రమాదం బారిన పడి తీవ్రంగా గాయపడటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన జగదీష్, లక్ష్మి దంపతుల మూడేళ్ల కుమారుడు నందకిషోర్ కాలిపై ఆదోని నుంచి ఉరుకుంద వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కడంతో తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు కాలుపై ఎక్కిందని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



బోరును పరిశీలిస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పరిసరాలల్లోని కార్యాలయాలకు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకన్నట్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ ఆఫీసు వద్ద ఎంపీపీ నిధులతో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆస్పరి సీఐ



మంత్రి జయరాంకు బొకే అందజేస్తున్న సీఐ హనుమంతప్ప

ఆలూరు: తిరుపతి నుంచి ఆస్పరి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సీఐ హనుమంతప్ప రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను శుక్రవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజల హక్కులకు భంగం కలగకుండా శాంతిభద్రతలను కాపాడాలని సీఐకి మంత్రి జయరాం సూచించారు.

నాటుసారా స్వాధీనం


ఆదోనిరూరల్: మండలంలోని ఇస్వీ గ్రామ కొండల్లో నాటుసారా తయారు చేసిని తరలిస్తున్న పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ రవిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

టీబీ డ్యాంలో నిలకడగా నీటి నిల్వలు



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. జలాశయం నుంచి అన్ని కాలువలకు వదులుతున్న నీటిని నిలిపివేయడం, వేసవి మొదలు కాకపోవడంతో డ్యాంలో నిల్వలో తేడా కనబడటం లేదు. కొన్ని వారాలుగా 10 టీఎంసీల మేరు నీరు నిల్వ ఉంటోంది. శనివారం 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి 10.182 టీఎంసీల నిరు నిల్వలున్నాయి.

శ్రీమఠం వేడుకల్లో కేంద్ర మంత్రి



పీఠాధిపతి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న మంత్రి ప్రహ్లాద జోషి

మంత్రాలయం: కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి శ్రీమఠంలో జరిగిన రథోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల చేతుల మీదుగా రాఘవేంద్రుల జ్ఞాపిక ,శేషవస్త్రం, ఫలమంత్రాక్షింతలు అందుకున్నారు. అంతకు ముందు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రుల మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకుని హారతులు పట్టారు.

వాయుపుత్రుడికి విశేష పూజలు



అగసలదిన్నెలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కౌతాళం: మండలంలోని వివిధ ఆలయాల్లో ఆంజనేయ స్వామికి భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆం.నేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆయా ఆలయాలు రద్దీగా మారాయి. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు.

జోరుగా ఇళ్ల నిర్మాణాలు



కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

ఆదోని సెంట్రల్: పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 9,327 ఇంటి స్థలం లేని వారికి పట్టాలు ఇచ్చారు. అందులో మొదటి విడతగా 6,495 మందికి ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. పేద మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకుని ఇళ్లను కట్టి ఇవ్వాలనే లక్ష్యంతో థర్డ్ పార్టీ వారికి ఇళ్ల నిర్మాణ పనులను అప్పగించింది. కాలనీలో ఇప్పటి వరకు 1,330 ఇళ్లు టాప్ పూర్తి చేసుకోగా, 750 ఇళ్లు రూఫ్ లెవల్, 482 ఇళ్లు లింటల్ లెవల్‌లోను ఉన్నాయి. 3,209 బేస్ మట్టం లెవల్‌లో, 724 ఇళ్లు ప్లింత్‌బీమ్ లెవల్‌లో ఉన్నాయి. లేబర్ కొరత వంటి సమస్యలను పరిష్కరించుకొని నాణ్యతతో పనులను చేపట్టాలని హౌసింగ్ ఈఈ రవికుమార్ తెలిపారు.